ప్రజాశక్తి

శుక్రవారం 10 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంతటా అదే మాట..

పోరాడే వారికే బాసట

పిడిఎఫ్‌కు పట్టం కట్టే దిశగా పట్టభద్రుల ఆలోచనా సరళి
క్షేత్రస్థాయి ప్రచారంలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ముందంజ

కోరెడ్ల రమాప్రభ గెలుపుకోసం స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే దారి పొడవునా ప్రచారం చేపడుతున్న మద్దతుదారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 13న జరుగనున్న ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో ఈ ప్రాంత పట్టభద్రులు అత్యంత భిన్నంగా స్పందించే అవకాశాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని నిరుద్యోగుల ఆశలు, సాధారణ ప్రజల ఆకాంక్షలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళలు, విద్యార్థి, యువజన రంగాలకు చెందిన వారి ఆకాంక్షలకు అద్దంపట్టే ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిత్వం పట్ల నిరుద్యోగ యువత ఆలోచన సాగిస్తున్న విషయం సర్వత్రా కనిపిస్తోంది. 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఇప్పటికే అన్ని జిల్లాల్లో కలియదిరుగుతూ పట్టభద్రులకు చేరువయ్యారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యల ప్రాతిపదికన ఆంశాల వారీగా ఆమె గొంతెత్తిన తీరు అందరినీ ఆలోచింపజేస్తోంది. తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమస్యలపై తన వాణిని మండలిలో వినిపిస్తానని ఆమె చెబుతున్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధన, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ, రైల్వే జోన్ సాధన, ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధించే సిపిఎస్ రద్దుకు ఉద్యమం, నిరుద్యోగుల కోసం ఈ ప్రాంతంలో పరిశ్రమల సాధనకు పోరాటాలే అజెండాగా తనదైన శైలిలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పని విధానం ఉంది. ఈ విషయాన్నే ఇంటెలిజెన్స్ నివేదికలు సైతం తాజాగా రూఢీపర్చడం విశేషం.

రాజకీయ పార్టీలతో విసిగి వేసారిన మేధావులు, పట్టభద్రులు

గత శాసన మండలి ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి గెలిచిన బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసిన కృషి, తెచ్చిన నిధులూ శూన్యం. ఉత్తరాంధ్రకు అత్యంత కీలక పరిశ్రమగా మిగతా 2లో..

మాట్లాడుతున్న పోటీ పరీక్షల నిపుణులు, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రణాళికాబద్ధంగా చదవండి

పోటీ పరీక్షల నిపుణులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు
గ్రూప్ - 2 పరీక్షపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్రూప్ - 2 పరీక్షకు సంబంధించి అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు కెఎస్.లక్ష్మణరావు తెలిపారు. అల్లూరి స్టడీ సర్కిల్, డివైఎఫ్ఐ సంయుక్తంగా డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గ్రూప్-2 పరీక్షపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించాయి. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ అకడమిక్ పరీక్షలలో 35 మార్కులు వస్తే పాస్ అవుతామని, కానీ పోటీ పరీక్షల్లో పాస్ అవడం అలా కుదరదని, ఒక మార్కుతో ఉద్యోగాలు కోల్పోయిన వారు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకొని విద్యార్థులంతా ఒక మార్క్ కూడా తగ్గకుండా పోటీ పరీక్షలకు సంసిద్ధం కావాలన్నారు. సిలబస్‌ను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలన్నారు. పాత ప్రశ్నాపత్రాలను అభ్యసించాలని, సబ్జెక్టులను, కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని చదివితే కచ్చితంగా విజయం సాధించవచ్చునని ఆయన తెలిపారు. పోటీ పరీక్షల్లో గతంలో అడిగిన కొన్ని ప్రశ్నలను విద్యార్థులకు వివరించారు. పలు సబ్జెక్టులకు సంబంధించి చదవాల్సిన మిగతా 2లో..

24 నుంచి ఎయు డిగ్రీ పరీక్షలు

వార్త 2లో..

ఓటర్లకు 13న ఎన్నికల సెలవు ఇవ్వాలి

వార్త 2లో..

సిపిఎస్ రద్దు కోరుతూ రెవెన్యూ ఉద్యోగుల నిరసన

వార్త 3లో..

పనులను పరిశీలిస్తున్న ప్రవీణ్ కుమార్

జి-20 సుందరీకరణ పనులు పూర్తి చేయండి

సిడిఎంఎ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జి-20 సదస్సు సందర్భంగా చేపట్టిన నగర సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిడిఎంఎ ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఎయిర్ పోర్ట్ నుండి ర్యాడిసన్ బ్లూ హోటల్ వరకు జరుగుతున్న నగర సుందరీకరణ పనులను జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరంలో జి-20 సదస్సు ఈ నెల 28, 29 తేదీలలో జరగబోతున్నందున నగర సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్, తెలుగు తల్లి ఫ్లై ఓవర్, సిరిపురం జంక్షన్, పార్కు హోటల్ జంక్షన్, సీతకొండ, గుడ్లవానిపాలెం, సాగర్ నగర్, ర్యాడిసన్ బ్లూ హోటల్ వరకు సి వ్యూ అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్‌కు మిగతా 2లో..

యువతకు ఉపాధి చూపని ప్రభుత్వం

◆ **అమలుకాని జిఒ 21** ◆ **పరిశ్రమల్లో స్థానికులకు లభించని ఉద్యోగాలు**
◆ **ప్రభుత్వ శాఖల వద్ద లెక్కలూ కరువే..**

అచ్యుతాపురం సెజ్‌లోని ఓ పరిశ్రమ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రయివేటు పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు లభించడం లేదు. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తూ 2019 అక్టోబర్ 14న జారీచేసిన జిఒ 21 అమలుకు అడుగు కూడా ముందుకుపడలేదు. ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిమెంట్ ఆఫ్ లోకల్ క్యాండిడేట్స్ ఇన్ ఇండస్ట్రీస్, ఫ్యాక్టరీస్ యాక్ట్ 2019 చట్టం ప్రకారం జిఒ 21 జారీచేసి రెండేళ్లు గడుస్తున్నా ఆచరణకు నోచుకోలేదు. స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాల కల్పనపై అటు ప్రభుత్వంగానీ, ఇటు ప్రతిపక్ష టిడిపిగానీ పట్టించుకున్న పాపానపోలేదు. తాంబూళాలిచ్చాం... తన్నుకు చావండి అన్నట్లు జిఒ జారీచేసి ప్రభుత్వం చేతులుదులుపుకుంది. జిఒ జారీ చేసిన ఈ రెండేళ్లలో ప్రయివేటు పరిశ్రమల్లో ఎంతమంది స్థానికులకు ఉపాధి కల్పించామన్న సమాచారం కూడా లేదు. ఇపుడిప్పుడే ఉపాధి కల్పనశాఖ కార్యాలయం నుంచి ప్రయివేటు పరిశ్రమలకు నోటీసులు వెళ్తున్నాయి. పరిశ్రమల్లోని ఉపాధి పొందుతున్న వారిలో ఎంతమంది స్థానికులున్నారన్న సమాచారం పరిశ్రమల నుంచి రాబెట్టే ప్రయత్నం ఇంతవరకు ప్రభుత్వం చేయలేదు. దీంతో పరిశ్రమల్లో స్థానిక మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పోరాడే వారికే బాసట

వెలుగొందుతున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి అమ్మకానికి పెట్టగా కార్మికవర్గం పోరాడుతుంటే ఆయన చెప్పిన మాటలు విస్మయం గొలుపుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ ఇక్కడే ఉంటుందని కాకపోతే ప్రైవేటీకరణ అవుతుందని' అతడు వ్యాఖ్యానించడం పట్ల ఈ ప్రాంత మేధావులు, కార్మికులు, నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్ర స్థాయిలో ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రంలో అధికారం వెలగబెడుతున్న వైసిపి మీనమేషాలు లెక్కిస్తూ స్టీల్‌ప్లాంట్ వ్యవహారంలో కేంద్ర విధానాన్ని వ్యతిరేకించకుండా దోబూచులాడుతోంది. ఆ పార్టీ తరపున మండలి ఎన్నికల బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ప్రజా సమస్యలపై అవగాహన లేదు. ఈ విషయాలపైనా చర్చలు సాగుతున్నాయి. ఉత్తరాంధ్రలోని వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ నిర్వహణపైనా ఈ ప్రాంతంలో వ్యతిరేకత భగ్గుమంటోంది. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు వైసిపి వైఫల్యాలను సరైన రీతిలో ఎత్తిచూపడం లేదు. అతనికీ ప్రజా సమస్యలపై పని చేసిన చరిత్ర లేదు. విద్యావేత్తగా చెప్పుకుంటూ నిరుద్యోగుల ఓట్లను కొట్టేసే ప్రణాళికతో ఆయన ఉన్నట్లు పలువురు చెబుతున్నారు.

పిడిఎఫ్ అంటేనే విలక్షణత

2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో తొలిసారిగా పిడిఎఫ్ అనే పదం వినిపించింది. సామాజిక బాధ్యత, ప్రగతిశీలమైన వ్యక్తుల సమూహంగా పిడిఎఫ్‌కు గణనీయ స్థానం ఉంది. ఐటిటి రామయ్యగా పిలవబడే చుక్కా రామయ్య, ప్రఖ్యాత రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, డాక్టర్ గేయానంద్, గతంలో రెండు పర్యాయాలు ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానంలో గెలిచి ప్రజల నోట్లో నాలుకలా మారిన ఎంవిఎస్.శర్మ, ప్రస్తుత ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, వై.శ్రీనివాసుల రెడ్డి సేవలు అందరికీ తెలిసినవే. వారి వారసత్వాన్ని నిలిపే సత్తా కోరెడ్ల రమాప్రభది అని పట్టభద్రులు చెప్పుకుంటున్నారు. 25 ఏళ్లుగా విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పిల్లలు, పెద్దలు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థి, యువజన రంగాల అభివృద్ధికి తన వంతుగా సామాజిక సేవలో పేరొందిన ఆమె వైపునకు అందరి దృష్టి మరలుతోంది. ఈ క్రమంలోనే ఆమె ప్రచారానికి విశేష ఆదరణ లభిస్తోంది.

యువతకు ఉపాధి చూపని ప్రభుత్వం

యువతకు 75 శాతం ఉపాధి హామీగానే మిగిలిపోయింది.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వంద మంది కార్మికులకుపైగా పనిచేస్తున్న పరిశ్రమలు దాదాపు 344 ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న 47,198 మందిలో 12,071 మంది మహిళలున్నారు. 25 మందిలోపు కార్మికులున్న పరిశ్రమలు 169 వున్నాయి. వీటిలో పనిచేస్తున్న 2,986 మంది కార్మికుల్లో మహిళలు 933 మంది వున్నారు. మొత్తం 513 యూనిట్లలో 50,184 మంది పనిచేస్తున్నారు. వీరిలో మహిళలు 13,004 మంది వున్నారు. ప్రయివేటు యూనిట్లలో పనిచేస్తున్న 50,184 మంది కార్మికుల్లో స్థానికులు ఎంతమంది అనే ప్రాథమిక సమాచారం ప్రభుత్వ శాఖల వద్ద లేదు. జిఒ జారీపై ప్రభుత్వం చూపిన శ్రద్ధ ఉద్యోగాల కల్పనపై చూపకపోవడంతో పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలన్న జిఒ అమలుకావడంలేదు. ఏయే యూనిట్లలో ఎంతమంది స్థానికులు పని చేస్తున్నారన్న సమాచారం లేకపోవడం, పరిశ్రమల నుంచి రాబట్టకపోవడంతో స్థానిక యువతకు 75 శాతం ఉపాధి జిఒ అచేతనంగా తయారైంది. జిఒ జారీచేసిన తరువాత ప్రయివేటు పరిశ్రమల్లో జరుగుతున్న నియామకాల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వారితో పరిశ్రమాధిపతులు పనిచేయించుకుంటున్నారు. రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సొంత జిల్లాలో కూడా 75 శాతం స్థానికులకు ఉపాధి జిఒ అమలుకాలేదంటే మిగిలిన జిల్లాలో పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు.

జిఒ అమలుపై జిల్లా స్థాయి నోడల్ ఏజెన్సీని నియమించినా అది కూడా సరిగ్గా పనిచేయడంలేదు. నోడల్ ఏజెన్సీ ఛైర్మన్‌గా కలెక్టర్‌ను, మెంబర్‌గా జిల్లా ఇండస్ట్రియల్ సెంటర్ జనరల్ మేనేజర్‌ను, మెంబర్ కన్వీనర్‌గా జిల్లా ఉపాధి కల్పనాశాఖాధికారిని నియమిస్తూ ప్రభుత్వం జిఒలో పొందుపర్చినా ఆ తరహా పర్యవేక్షణ జరగడంలేదు. పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించడానికి పరిశ్రమాధిపతులు ఆసక్తి చూపకపోవడంతో జిఒ అమలుకు అటు ప్రభుత్వంగానీ, ఇటు ప్రధాన ప్రతిపక్ష టిడిపిగానీ కనీస శ్రద్ధ చూపకపోవడంతో జిఒ రికార్డులకు పరిమితమైంది. ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువత ఉపాధిలేక అనేక అవస్థలు పడుతోంది. స్థానిక యువతకు జిఒ 21 ప్రకారం 75 శాతం ఉద్యోగాలు కల్పించని పరిశ్రమాధిపతులకు రూ.25 వేలు నుంచి రూ.50 వేలు వరకు అపరాధ రుసుము వసూలుచేసే అధికారం నోడల్ ఏజెన్సీకి వుంది. ఆ పనీ జరగలేదు.

75 శాతం స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించేందుకు జారీచేసిన జిఒ 21ని అమలుచేయకపోవడం అన్యాయం. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి కనబరచడం లేదు. నన్ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా కృషి చేస్తాను. శాసనమండలిలో జిఒ 21 అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిరుద్యోగుల పక్షాన నిలుస్తాను.

డాక్టర్ కోరెడ్ల రమాప్రభ,
ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి

ప్రణాళికాబద్ధంగా చదవండి

పుస్తకాల వివరాలను ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు

విశ్రాంత ఎఎస్‌పి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సమాయత్తమయ్యేవారు పుస్తకాలను బట్టీ పట్టడం కాకుండా నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించాలని ఆయన సూచించారు బద్ధకాన్ని వదిలి చదువుతున్న సబ్జెక్టుపై ఇష్టం పెంచుకుని చదివితే అది త్వరగా అర్థమవుతుందని తెలిపారు. ఎలా చదవాలి ? పరీక్షకు ఎలా సమాయత్తం అవ్వాలి ? అన్న విషయాలను ఆయన క్షుణ్ణంగా వివరించారు. సమాధానాలను చాలా స్పష్టంగా, క్లుప్తంగా, అర్థమయ్యే విధంగా రాయాలన్నారు. తద్వారా మంచి మార్కులు సాధించడానికి మార్గం సుగమమవుతుందని తెలిపారు.

పిడిఎఫ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సుమారు 2 లక్షల మంది ఉత్తరాంధ్ర నుంచి వలస వెళ్లి పోతున్నారని తెలిపారు. నిరుద్యోగుల సంఖ్య పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పి సిఎం జగన్మోహన్‌రెడ్డి మోసం చేశారన్నారు. తనను గెలిపిస్తే యువత, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గాయత్రి కోచింగ్ సంస్థల అధ్యాపకులు ఎస్.శ్రీనివాసరావు, అల్లూరి స్టడీ సర్కిల్ బాధ్యులు అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

జి-20 సుందరీకరణ పనులు పూర్తి చేయండి

ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే విశాఖ నగరం అతి పెద్దది అయినందున పర్యాటకులు, సందర్శకులు అధిక సంఖ్యలో ఇక్కడకు వస్తుంటారన్నారు. సుందరీకరణ పనులలో ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని అన్నారు. బీచ్‌లో సందర్శకులు ప్రమాదాల బారిన పడకుండా కమ్యూనిటీ గార్డులను ఏర్పాటు చేశామన్నారు.

ఓటర్లకు 13న ఎన్నికల సెలవు ఇవ్వాలి

కలెక్టర్‌కు డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజ్ఞప్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పలు అంశాలను గమనంలో ఉంచుకోవాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయాన్ని సాయంత్రం 4 గంటలకే ముగిసేలా ఎన్నికల కమిషన్ తగ్గించిందన్నారు. చాలా సంస్థలలో సిబ్బంది సంఖ్య తగ్గిపోయిందన్నారు. కొన్ని పాఠశాలలలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారని తెలిపారు. అలాగే అనేక మంది ఓట్లు తమ ప్రస్తుత నివాస ప్రాంతంలో కాకుండా వారి ఆధార్ కార్డు ఆధారంగా నమోదయ్యాయన్నారు. ఇవి కొన్ని సందర్భాలలో పని చేస్తున్న ప్రదేశానికి చాలా దూరంలో, వేరే జిల్లాలలో కూడా ఉన్నాయన్నారు. ఏదో పూట పర్మిషన్ ఇచ్చినా, వీరందరూ ఓటు వేసి తిరిగి డ్యూటీకి చేరలేరని తెలిపారు. ఇది ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, మిగిలిన సంస్థలకూ వర్తిస్తుందన్నారు. అందువల్ల అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ఆ రోజు ఓట్లు ఉన్న వారందరికీ పూర్తిరోజు ప్రత్యేక సెలవు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

సరైన చికిత్సతో

కిడ్నీ వ్యాధుల నుంచి ఉపశమనం

- యూరాలజిస్ట్, ఎఐఎన్‌యు ఎమ్‌డి డాక్టర్ జి.రవీంద్రవర్మ

మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రవర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్: మూత్రపిండాల వ్యాధులను సకాలంలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే బాధిత రోగులు కోలుకుని, యథావిధిగా ఆరోగ్యకరమైన జీవనం సాగించొచ్చని ప్రముఖ యురాలజిస్ట్, ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఎఐఎన్‌యు) ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.రవీంద్రవర్మ అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీవ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా ద్వారకానగర్‌లోని ఎఐఎన్‌యు ఆసుపత్రిలో మూత్రపిండాల సమస్యలపై అవగాహన ప్రజా సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రవీంద్రవర్మ మాట్లాడుతూ మూత్రపిండాల రోగులకు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన పెంపొందించటం, వారిలోని నైపుణ్యతలను మెరుగుపరచటం, హెల్త్ కేర్ సిస్టమ్స్ నుంచి అధిక ఫలితాలను పొందేవిధంగా వారికి సన్నద్ధులను చేయడం ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తుచేసారు. మూత్రపిండాలను ఆరోగ్యకరంగా ఉంచేందుకు పాటించాల్సిన ఎనిమిది విలువైన సూచనలను వివరించారు. ఆరోగ్యంగా, చురుకుగా ఉండడం, ఆరోగ్యమైన సమతుల్య ఆహారం తీసుకోవడం, రక్తంలోని సుగర్ లెవెల్స్‌ను, రక్తపోటును ఎప్పటికప్పుడు పరీక్షించడం, నియంత్రణలో ఉంచుకోవడం, రోజూ తగు పరిణామంలో ద్రవపదార్థాలు తీసుకోవడం, ధూమపానం మానేయడం, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, పెయిన్ కిల్లర్ మాత్రలు వాడకాన్ని వీలైనంత తగ్గించడం, మూత్రపిండాల పనితీరును క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, యూరాలజిస్ట్ డాక్టర్ అమిత్, డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ వాణి పాల్గొన్నారు.

24 నుంచి ఎయు డిగ్రీ పరీక్షలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం డిగ్రీ ఐదవ సెమిస్టర్ రెగ్యులర్, ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24నుంచి ప్రారంభమౌతాయన్లి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు.
డిగ్రీ మొదటి, మూడవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు, అలాగే రెండు, నాలుగవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల 6 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో జరుగుతాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షల తేదీలు, పరీక్షల వేళలు, ఇతర వివరాలను ఎయు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇతర వివరాలు ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నటు

విశాఖ పోర్టును సందర్శించిన ఐఎఎస్‌ల బృందం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారత్ సందర్శన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల నుంచి గ్రూప్ 2 ఐఎఎస్‌లుగా ఉద్యోగోన్నతి పొందిన బందం సభ్యులు గురువారం విశాఖపట్నం పోర్టును సందర్శించారు. బృందానికి స్వాగతం పలికిన పోర్టు ఛైర్మన్ కె.రామమోహనరావు, వారితో పరిపాలనా కార్యాలయంలోని బోర్డ్ రూంలో సమావేశమయ్యారు. ఐఎఎస్‌లుగా ప్రమోషన్ పొందిన వారిని ఛైర్మన్ అభినందించారు. పోర్టులోని మౌలిక వసతులు, ఆధునికీకరణ, యాంత్రీకరణ అంశాలతోపాటు శతశాతం సోలార్‌విద్యుత్‌వినియోగం, ఎగుమతి, దిగుమతులకు ఉన్న అవకాశాలపై ఐఎఎస్‌ల బృందానికి పోర్టు ఛైర్మన్ వివరించారు.

ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై సిపి సమీక్ష

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ సమీక్షించారు. సిపి కాన్ఫరెన్స్ హాల్‌లో శాంతిభద్రతలు, నేరవిభాగం డిసిపిలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జోన్ల వారీగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తుపై డిసిపిలతో సమీక్షించారు. అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను సందర్శన, వాటిపై అవగాహనపై ప్రశ్నించి నిర్ధారించుకున్నారు. పోలింగ్ మెటీరియల్ తరలింపులో అన్ని రూట్లలో ఎస్కార్ట్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ల సంఖ్యపై చర్చించారు. రిజర్వు ఫోర్సులను ఏయే జోన్లకు కేటాయించాలో ఆదేశించారు. చెక్ పోస్టుల పనితీరు తెలుసుకున్నారు. పోలింగ్ ముందురోజునుంచి కౌంటింగ్, ఫలితాల ప్రకటన పూర్తయ్యేవరకు వ్యవహరించాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎడిసిపి(ఎస్‌బి) డి.గంగాధర్, ఇతర అధికారులతో ఎయు ఇంజనీరింగ్ కాలేజీలో పోలింగు బూత్‌లను, స్ట్రాంగ్ రూములు, బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు.

'అది మోసపూరిత సమ్మిట్'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖలో ఇటీవల జగన్ నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ కాదని జె సమ్మిట్ అని, అదో మోసపూరితమైనదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మిట్ కోసం జగన్ విశాఖలో ఉన్నన్ని రోజులూ ఉత్తరాంధ్ర వాసులకు కంటిమీద కునుకు లేదన్నారు. ఎక్కడ, ఎవరి భూములు దోచుకుంటారనే భయంతో నిద్రపోలేదని తెలిపారు.

నేడు ఢిల్లీకి మేయర్ పయనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేషనల్ ప్లాట్‌ఫారం డిజాస్టర్ రిస్క్ రెడ్యూస్ అర్బన్ లోకల్ బాడీస్ తరఫున సభ్యురాలిగా నామినేట్ అయిన నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం ఢిల్లీకి బయలుదేరనున్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో అక్కడ జరగనున్న ఆ విభాగం జాతీయ విపత్తుల మూడో సెషన్‌లో పాల్గొననున్నారు.

ఆర్‌పిఎఫ్ బ్యారక్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని డీజిల్ లోకో షెడ్ వద్ద పునరుద్ధరించబడిన ఆర్‌పిఎఫ్ బ్యారక్‌ను గురువారం వాల్తేరు రైల్వే డివిజన్ మేనేజర్ అనుప్ సత్పతి ప్రారంభించారు. అనంతరం డిఆర్‌ఎం, ఇతర అధికారులు అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఎం మాట్లాడుతూ సిబ్బంది విశ్రాంతి తీసుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

సిపిఎస్ రద్దు కోరుతూ రెవెన్యూ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రెవెన్యూ ఉద్యోగులు గురువారం స్థానిక ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా పట్టించుకోలేదని ఉద్యోగులు విమర్శించారు. చట్ట బద్ధంగా రావల్సినవి, తాము దాచుకున్న డబ్బులు ఇవ్వడం లేదని వాపోయారు. హామీలు ఇచ్చి, మర్చిపోయిన అంశాలను గుర్తు చేసేందుకే తమ ఉద్యమం అని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోగా సిపిఎస్‌ను రద్దు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 9 నుంచి ప్రారంభమైన ఉద్యమం ఏప్రిల్ 3వ తేదీ వరకు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రమేష్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీకుమారి, విఆర్ఎ కె సుధీర్, కార్యాలయ సబార్డినేటర్లు నారాయణప్పడు, వెంకటరావు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్‌లో ఉన్న తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం భీమిలి నియోజకవర్గ కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పద్మనాభం తహశీల్దార్ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

భీమిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫారం నెంబర్ 1లో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడు గాజువాక రాజీవ్ నగర్‌లోని సెక్టర్ 1 నివాసి అప్పలరాజుగా గుర్తించారు. స్థానిక ఎస్ఐ శాంతారామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశామని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

మత్స్యకారునిపై రౌడీషీటర్ దాడి

ప్రజాశక్తి – ఆరిలోవ : ఆరిలోవ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్‌గా ఉన్న అప్పలరాజు మద్యం మత్తులో ఒక మత్స్యకారునిపై దాడి చేసినట్లు ఆరిలోవ సిఐ సోమ శేఖర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... జోడుగుళ్లపాలెనికి చెందిన రౌడీషీటర్ అప్పలరాజు, స్థానిక మత్స్యకారుడైన డేవిడ్ కలిసి జోడుగుళ్లపాలెం ఇసుక దిబ్బపై లంగరు వేసిన బోటుపై కూర్చుని మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో వీరి మధ్య ఘర్షణ తలెత్తింది. డేవిడ్, రౌడీ షీటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన అప్పలరాజు డేవిడ్‌పై దాడి చేశారు. డేవిడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డేవిడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 324 క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శేఖర్ తెలిపారు. ఆరిలోవ పరిధిలో రౌడీ షీటర్లు హద్దులు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసు నమోదు చేసి చర్యలకు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలో రెండు వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన వివరాలు..మాకవరపాలెంలో ఫైనీయర్ కంపెనీకి తాళ్లపాలెం నుంచి లారీ లోడుతో వస్తుంది. మాకవరపాలెం మండలం శెట్టిపాలెం వద్దకు లారీ రాగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొని దాని వెనుక ఉన్న లారీని బలంగా ఢీకొంది. దీంతో స్పిరిట్ లారీలో ఉన్న గాడి రమణ (డ్రైవరు)కి గాయాలు అయ్యాయి. విశాఖపట్నంలో ఆసుపత్రికి బాధితుడిని తరలించారు. అలాగే మరో లారీ డ్రైవరు అనిమిరెడ్డి ఈశ్వరరావుకి స్వలంగా గాయాలు తగలడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఆగిన మైనర్ వివాహం

ప్రజాశక్తి - ఆరిలోవ : మైనర్ వివాహాన్ని సీడ్ చైల్డ్‌లైన్, ఐసిడిఎస్, రెవెన్యూ సిబ్బంది గురువారం అడ్డుకున్నారు. అధికారుల కథనం ప్రకారం... పలాస ప్రాంతానికి చెందిన బాలిక (17) పాతడైరీఫారం ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తితో రవీంద్రనగర్‌లోని ప్రయివేటు కల్యాణ మండపంలో గురువారం రాత్రి వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సీడ్ చైల్డ్‌లైన్ 1098కు అందిన సమాచారం మేరకు విశాఖ జిల్లాకు చెందిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్, సీడ్ చైల్డ్‌లైన్ 1089 ప్రతినిధులు, ఆర్‌ఐ ప్రవీణ్, మహిళా పోలీసులు కల్యాణమండపానికి చేరుకొని పెండ్లి కుమార్తె పుట్టిన తేదీ వివరాలడిగి తెలుసుకున్నారు. పెండ్లి కుమార్తె మేజర్ కాకపోవడంతో ఆమె తల్లిదండ్రులను, పెండ్లి కుమారుడిని సమావేశ పరిచి కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలుపుదలచేశారు.

గ్లకోమాతో 11 లక్షల మందికి అంధత్వం

ప్రజాశక్తి - ఆరిలోవ : కంటిలో ఒత్తిడి పెరుగుదలతో వచ్చే గ్లకోమా అంధత్వానికి దారితీస్తుందని, దీనిని నివారించడానికి ఈ వ్యాధిపై అవగాహన అవసరమని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి డాక్టర్ సాయి యశ్వంత్ తెలిపారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా గణాంకాల ప్రకారం మనదేశంలో 1.12 కోట్ల మంది గ్లకోమాతో బాధ పడుతున్నారని, వీరిలో 11 లక్షల మంది పూర్తి అంధత్వానికి గురయ్యారని తెలిపారు. వారసత్వం, కంటిలో పెరిగే ఒత్తిడి, మరికొన్ని కారణాల వల్ల ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. గ్లకోమా వ్యాధిని గుర్తించేందుకు ఎటువంటి సంకేతాలు ఉండవని, ఇది ఒక నిశ్శబ్ద చూపు దొంగగా వర్ణించవచ్చుని పేర్కొన్నారు. 40 ఏళ్ల పైబడిన వారు కంటి పరీక్షలు చేయించు కోవడం అవసరమని తెలిపారు. ప్రారంభ దశలోనే గుర్తిస్తే కంటి చుక్కల మందుతో దాన్ని పెరగకుండా నివారించవచ్చని చెప్పారు. మరికొందరికి లేజర్ ఆపరేషన్ ద్వారా కంటిలో వచ్చే ఒత్తిడి తగ్గించి వ్యాధి పెరగకుండా కాపాడవచ్చన్నారు. గ్లకోమా కన్సల్టెంట్ డాక్టర్ కొడాలి శివాని మాట్లాడుతూ, ఈ నెల 12న ఆర్‌కె బీచ్ వద్ద ఉదయం 5.45 గంటలకు గ్లకోమా అవగాహన వాక్, ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటల వరకు ఎల్‌విపిఐఐ యూట్యూబ్ చానల్ ద్వారా రోగి ప్రశ్నకు సమాధానాలు చెప్పే కార్యక్రమం ఉంటాయని చెప్పారు.

అనధికారిక బోర్డులు తొలగించండి

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

పలు సూచనలిస్తున్న జివిఎంసి కమిషనర్ రాజాబాబు

ప్రజాశక్తి -మధురవాడ : బీచ్ రోడ్డులోని అనధికారిక బోర్డులను తొలగించాలని పట్టణ ప్రణాళికాధికారులను జివిఎంసి కమిషనర్ రాజాబాబు ఆదేశించారు. జివిఎంసి 8, 9 వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. సీతకొండ "వ్యూ" పాయింట్, గుడ్లవానిపాలెం అమ్మవార్ల గుడి ప్రాంగణం, సాగర్‌నగర్ బీచ్, రాడిసన్ బ్లూ హోటల్ తదితర బీచ్ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో జి–20 సదస్సు జరగబోతున్న దృష్ట్యా బీచ్ రోడ్డులో ఉన్న అనధికార బోర్డులు తొలగించాలని, సీతకొండ "వ్యూ" పాయింట్ వద్ద సుందరీకరణ, విద్యుత్ అలంకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, బీచ్ రోడ్డు "వ్యూ" పాయింట్ల వద్ద వెండింగ్, పార్కింగ్, ప్లాంటేషన్, లైటింగ్ పనులు ఒక పద్ధతిలో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాడిసన్ బ్లూ హోటల్ ప్రాంతంలో చెట్లను ఆకర్షణీయంగా ట్రిమ్మింగ్ చేయించాలని, సాగర్ నగర్ పరిసర ప్రాంతాలలో సెంటర్ మీడియన్లలో, పారిశుధ్యం, పచ్చదనం, విద్యుత్ దీపాలు ఏర్పాటు తదితర పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. బ్యూమూన్ హోటల్ వద్ద కొండపై సూచించిన ప్రదేశంలో ఆకర్షణీయంగా సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. సీతకొండ నుంచి రాడిసన్ బ్లూ హోటల్ వరకు ఫుట్‌పాత్‌లు, పార్కింగ్ రోడ్లలో ఆకర్షణీయమైన పెయింటింగులు, విద్యుత్ దీపాలంకరణ, ప్లాంటేషన్ పనులు వారం రోజులలో పూర్తిచేయాలని పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్ రాజును, రెండవ జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మిని ఆదేశించారు. ఈ పర్యటనలో పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్, డీడీ (హార్టికల్చర్) ఎం.దామోదరరావు, జి– 20 సదస్సు లైజనింగ్ ఆర్గనైజర్ చక్రవర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు, ఎఎంఒహెచ్ డాక్టర్ ఎన్.కిశోర్, డిసిపి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం ప్రతినిధులు గురువారం ఆర్‌డిఒ భాస్కరరెడ్డికి, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్‌కు, ఎస్‌టిఒలకు వినతిపత్రం అందజేశారు. 2018 జులై 1 నుంచి బకాయి ఉన్న డిఆర్ ఎరియర్లు, 11వ పిఆర్‌సి ఎరియర్లు వెంటనే చెల్లించాలని, 12వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని, ప్రతి నెలా 1వ తేదీ నాటికి పింఛను సొమ్ము జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న మెడికల్ హెల్త్ బిల్లుల చెల్లింపులు చేయాలని విజ్ఞప్తిచేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎపి పింఛన్‌దారుల సంఘం భీమిలి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు టి.భీమారావు, ఎం.ఆనందరావు తదితరులు ఉన్నారు.

ఆర్‌డిఒ భాస్కరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

ఘనంగా ముత్యమాంబ అమ్మవారి పండగ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంటలో ముత్యమాంబతల్లి అమ్మవారి పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన రాష్ట్ర నాయకులు శివశంకర్, స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గీతంలో న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మధురవాడ : భారత ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖ, న్యాయ విభాగం, గీతం స్కూల్ ఆఫ్ లా, భోపాల్‌లోని న్యాయగంగ ఈ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న న్యాయ అవగాహన సదస్సు గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. ప్రాథమికంగా పౌరుల తెలుసుకోవాల్సిన న్యాయ పరమైన అంశాలు, పౌరుల బాధ్యతలపై సమత స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకుడు రవి రెబ్బాప్రగడ ప్రసంగించారు. సైబర్ నేరాలు, వాటిని నియంత్రించే చట్టాలపై సిబిఐ విశ్రాంత ఐపిఎస్ అధికారి వి.వి.లక్ష్మీనారాయణ, గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా న్యాయ అవగాహనపై వివిధ నినాదాలు, సచిత్ర అంశాలతో ఎగ్జిబిషన్‌తో పాటు న్యాయ అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. సమకాలీన అంశాలను ఇతివృత్తంగా తీసుకుని విద్యార్థులు ప్రదర్శించిన వీధినాటిక ప్రజలను చైతన్య పరిచేదిగా ఉంది. న్యాయ వృత్తిలో మెళకువలపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, వాదోపవాదాలపై న్యాయస్థానంలో వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ బి.అనితారావు తెలిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ లా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

భూముల వివరాలడిగి తెలుసుకుంటున్న ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

ఆనందపురం మండలంలో ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలో భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి గురువారం పర్యటించారు. మండలంలోని పలు పంచాయతీలను సందర్శించారు. శిర్లపాలెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 260 ఎకరాల అన్‌సెటిల్ విలేజ్ భూములను పరిశీలించారు. సర్వే ఎంతవరకు వచ్చిందని తహశీల్దార్ రామారావును వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం సొంత్యాం రవిరేన్ పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని సందర్శించి వివరాలడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఈ బంకు పక్కన ఖాళీ స్థలంలో పాకలు వేసుకున్నవారిని బంకు యజమాని అర్ధరాత్రి దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయమై సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం ఆర్ఐ మణికంఠ, గ్రామ సచివాలయ సర్వేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ముస్లిముల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం నరసింహనగర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసే ముస్లిముల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐహెచ్.ఫారూఖీ కోరారు. నరసింహనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, కెవి బాబా, ముస్తఫా దేవరకొండ (ఇబ్రహీం) తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ దేశాలతో పాటు భారతదేశంలో కూడా కిడ్నీ వ్యాధిగ్రస్తులు రోజురోజుకూ పెరుగుతున్నారని, ఈ వ్యాధి బారిన పడకుండా అవగాహన పెంచుకోవడం అవసరమని ది అపోలో యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజు తాటపూడి, డాక్టర్ పి.ఎస్.వంశీధర్, డాక్టర్ నాయుడు ఎన్ చితికేలా, డాక్టర్ సందీప్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అధిక రక్తపోటు, మధుమేహం వల్ల కిడ్నీ సంబంధిత వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, 40 ఏళ్ల పైబడిన వారు తరుచూ సికెడి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందుగా కిడ్నీ వ్యాధిని గుర్తించవచ్చని చెప్పారు. ప్రపంచంలో ప్రతి పది మందిలో ఒకరు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ప్రారంభ దశలోనే దీన్ని గుర్తిస్తే ప్రాణపాయ స్థితి నుంచి తప్పించుకోవచ్చన్నారు. మంచి ఆహార అలవాట్లు, వ్యాయామం, ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవడం, మానసిక ప్రశాంతత అలవర్చుకుంటే కిడ్నీ సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించడం శుభపరిణామమన్నారు. ఈ సమావేశంలో నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అనిల్ కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్య బృందం

ప్రజాశక్తి ఆధ్వర్యాన..

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : ప్రజాశక్తి తెలుగు దినపత్రిక ఆధ్వర్యాన కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను గురువారం అందించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజాశక్తి అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలనే ఆశయంతోనే ప్రజాశక్తి స్టడీ మెటీరియల్ పంపిణీచేస్తున్నట్లు తెలిపారు. మూఢ విశ్వాసాలను విడనాడి, శాస్త్రీయంగా ఆలోచింపజేసే పత్రిక ప్రజాశక్తి అని చెప్పారు. విశాఖలో ప్రజాశక్తి ఎడిషన్ పెట్టి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో వరద సమయంలో విరాళాలు సేకరించి తిరుపతి, నెల్లూరు, కేరళలో బాధితులకు అందజేశామని చెప్పారు. కరోనా సమయంలో ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్ ఎడిటర్ ఆర్.కె.నాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవాలని కోరారు. ప్రజాశక్తి చెడుకు వ్యతిరేకంగా, మంచి సమాజ నిర్మాణం కోసం ఏర్పడిన పత్రిక అని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది వై.సత్యనారాయణ, స్కూల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాశరావు, ప్రజాశక్తి మేనేజర్ వెంకటేశ్వరరావు

సుబ్బారెడ్డి, అమర్‌నాథ్‌లకు ఆడారి కృతజ్ఞతలు



మంత్రి అమర్‌నాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆనందకుమార్

ప్రజాశక్తి ములగాడ : ఏపీ మైక్రో, స్మాల్ అండ్ మీడియం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంటర్‌ప్రైజెస్ (ఎపిఎంఎస్‌ఎండిసి) ఛైర్మన్‌గా నియమితులైన విశాఖ డెయిరీ ఛైర్మన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వై.సుబ్బారెడ్డిని, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ బృందం, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన ఎన్‌సిటిఇ సభ్యులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) సభ్యులు డాక్టర్ చంద్రప్రకాష్‌రెడ్డి సందర్శించారు. ముందుగా ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డితో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎయులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రసాదరెడ్డి వివరించారు. ఎయును స్వయం సమృద్ధి చేసే దిశగా స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్న విధానాలను వివరించారు. విద్యారంగంలో జరుగుతున్న మార్పులు, తదనుగుణంగా భవిష్యత్తు ఉపాధ్యాయులుగా మారే బిఇడి, ఎంఇడి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన విధానాలపై చర్చించారు. వర్సిటీ తరపున డాక్టర్ చంద్రప్రకాష్‌రెడ్డిని వీసీ సత్కరించారు. అనంతరం ఎయు విద్యా విభాగం ఆచార్యులతో ప్రకాష్‌రెడ్డి సమావేశమయ్యారు. నూతన విద్య విధానం ప్రాముఖ్యత, ప్రాధాన్యతను వివరించారు. దేశ గతిని మార్చే విధంగా దిశానిర్దేశం చేస్తూ నూతన విద్య విధానం అమలు చేస్తున్న విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య నాగరాజ కుమారి, ఆచార్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సొంత్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యాన పరీక్షా సామాగ్రిని, అట్టలను పంపిణీ చేశారు. వృక్ష ఫౌండేషన్ అధ్యక్షులు కాకర సురేష్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు మంచి భవిష్యత్తును నిర్మించుకునేందుకు విద్య పునాది అన్నారు. విద్య ద్వారా సంపాదించిన జ్ఞానం, నైపుణ్యాలు జీవితాంతం మీతోనే ఉంటాయని చెప్పారు. స్కూల్ కమిటీ ఛైర్మన్ బోదపు బంగారురాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అక్కిరెడ్డి దేముడుబాబు, హెచ్‌ఎం కెవి.సుబ్బారావు, పీడీ ఎల్.కన్నారావు, ఫౌండేషన్ సభ్యులు పి.మెహర్, కాకర కిరణ్, సిమ్మ సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టలు పంపిణీ చేస్తున్న వృక్షా ఫౌండేషన్ సభ్యులు

పలు చోట్ల మహిళా దినోత్సవం

ఎన్‌ఎస్‌టిఎల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఎన్‌ఎస్‌టిఎల్‌లో

ప్రజాశక్తి- కరాస: డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ), నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ (ఎన్‌ఎస్‌టిఎల్)లోని మానసి ఆడిటోరియంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్ఎస్.శిరీష, విశిష్ట అతిథులుగా ఐఐఎం ఇండోర్ డాక్టర్ శృతి తివారి, ఎన్‌ఎస్‌టిఎల్ ప్రథమ మహిళ వై.లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌టిఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, మహిళల సామర్థ్యాన్ని ఆయన ప్రశంసించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌టిఎల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ములగాడ : మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఆటల పోటీల్లో విజేతలకు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం 61వ వార్డులో కార్పొరేటర్ కొణతాల సుధను ఆనంద్ కుమార్ సత్కరించారు.

కంచరపాలెం : జివిఎంసి 57వ వార్డు పరిధి సుభాష్‌నగర్‌లో లక్ష్మీనారాయణ మహిళా సంఘం ఆధ్వర్యాన మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ ముర్రువాణి నానాజీ హాజరై మాట్లాడారు. లక్ష్మీనారాయణ గ్రూపు సేవలను అభినందించారు. ఈ సందర్భంగా 60 సంవత్సరాలు పైబడిన పలువురు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రూపు నిర్వాహకులు బీశెట్టి భవాని, శ్రీనివాసరావు, వెలగా పద్మావతి, బొడ్డేటి గోవిందమ్మ, మళ్ల లీలావతి, మద్దాల ఆదిలక్ష్మి, కాళ్ల సూర్యలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న ముర్రువాణి నానాజీ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై 20న చలో విజయవాడ

ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

ప్రజాశక్తి-అనకాపల్లి

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి తెలిపారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో గురువారం యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొమ్మనకుండా పొగ పెట్టినట్లు కార్మికులపై పని భారం, మానసిక ఒత్తిడి పెంచి ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. రకరకాల మెనూలు పెట్టి అందుకు తగ్గ పైసలు ఇవ్వక పోవడమే కాక కొత్తగా రాగి మాల్ట్ ఉదయం 8.30 గంటలకే ఇవ్వాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.3వేలు చాలీచాలని వేతనం ఇస్తూ ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుందని తెలిపారు. గ్యాస్ స్టవ్‌లు, సిలిండర్లు ఇవ్వకుండా గ్యాస్ స్టవ్‌పై వంట చేయాలని ఒత్తిడి చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పని భారం తగ్గించాలని, మెనూలో మార్పులు చేయాలని, యూనిఫారాలు ఇవ్వాలని, హైస్కూల్లో 9, 10 తరగతి తరగతులకు వంట చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని తదితర డిమాండ్లతో చలో విజయవాడ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న, కమిటీ సభ్యులు శ్రీదేవి, సూర్యలక్ష్మి, సత్యవేణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వరలక్ష్మి, చిత్రంలో ప్రసన్న తదితరులు

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ రవి పఠాన్ శెట్టి పరిశీలించారు. స్థానిక ఎఎంఎఎల్ హైస్కూల్లో వెబ్ కాస్టింగ్, పేపర్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూములను సందర్శించారు. సామాగ్రి పంపిణీ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికలు ఎన్ని గంటలకు ప్రారంభించాలి, ఎన్ని గంటలకు పూర్తి చేయాలి, వాహన ఏర్పాట్ల బందోబస్తు వంటి అంశాలపై అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియపై నోడల్ అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ లావణ్య

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

ప్రజాశక్తి -కశింకోట

పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే మంచి ఉత్తీర్ణత సాధించొచ్చని కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్యాధికారి కోనాడ లావణ్య అన్నారు. కన్నూరుపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో8 పదవ తరగతి విద్యార్థులకు ఆరోగ్యంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒత్తిడి లేకుండా చూసుకోవాలన్నారు. చదువు తోపాటు ఆటలు పాటలతో ఆరోగ్యం కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరదేశమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో పరదేశమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. దొడ్డి వారు, పెద దొడ్డి వారు, భీమునివారి ఇలవేల్పు అయిన పరదేశమ్మ వారి ఆలయాన్ని పునర్నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం తెల్లవారుజాము నుండి గ్రామస్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం హరి భజన సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భారీగా అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో దొడ్డి కృష్ణ, మళ్ళ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల పోస్టర్ అవిష్కరణ

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

యలమంచిలి వైయస్సార్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు మూడు రోజులు పాటు జరగనున్న రాష్ట్రస్థాయి క్యాడెట్ తైక్వాండో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను తైక్వాండో ఆర్గనైజింగ్ సెక్రటరీ నగిరెడ్డి సత్యనారాయణ గురువారం క్రీడాకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 550 మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. వాళ్ల వయసును బట్టి రెండు క్యాటగిరీలు వేరు చేసి, బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విజేతలు ఈనెల 29 నుంచి రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ములంపాక అచ్చం నాయుడు, అంతర్జాతీయ క్రీడాకారుడు దొరబాబు, ఎలమంచిలి తైక్వాండో క్లబ్ అధ్యక్షులు నగిరెడ్డి దొరయ్య, జాతీయ క్రీడాకారులు, తైక్వాండో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ, క్రీడాకారులు

మంత్రుల మాయమాటలతో మరోసారి మోసపోవద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉద్యోగ, ఉపాధ్యాయులు రాష్ట్ర మంత్రుల మాయమాటల్లో పడి మరోసారి మోసపోవద్దని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. గురువారం పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులను ఆయన కలిసి మాట్లాడారు. నాలుగేళ్లగా ఉద్యోగ, ఉపాధ్యాయులపై లేని ప్రేమ ప్రభుత్వానికి ఇప్పుడే పుట్టుకొచ్చిందా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలోనే మంత్రులకు, ఎమ్మెల్యేలకు ప్రజలు, కార్మికులు విద్యార్థులు, ఉపాధ్యాయులు గుర్తుకు వస్తారని తెలిపారు. మాయ మాటలు చెప్పి ఓట్లను కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ సిబ్బంది క్రమబద్దీకరణ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటన వంటి హామీలు గాలికి వదిలేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కాండ్రేగుల సత్యనారాయణ, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి కొట్టి రామకృష్ణ, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొడ్డేడ మురళి పాల్గొన్నారు.

131వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 131వ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గోవింద పాలెం గేటు వద్ద కూడా పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 131 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, పిల్లలు, మహిళలతో సహా ఆందోళన చేస్తామన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ వద్దకు పాదయాత్రగా వెళ్లే సమయం దగ్గర పడిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు, జెఎసి పెద్దలు పాల్గొన్నారు.

ఆందోళనచేస్తున్న నేవీ నిర్వాసితులు

అథ్లెటిక్స్ క్రీడాకారుడు గణేష్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి

జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ మీట్‌లో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించిన వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దమ్ము గణేష్‌కు వేచలం గ్రామ పెద్దలు, యువకులు, వేచలం నాయుడుబాబు, సిరి ఫౌండేషన్, మామిడిపల్లి గ్రామానికి చెందిన సర్కార్ హెల్పింగ్ హ్యాండ్స్ తదితర సంస్థలు గురువారం ఆర్థిక సహకారం అందించారు. బీహార్ రాష్ట్రం పాట్నాలో ఫిబ్రవరి 10, 11, 12 తేదీలలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ మీట్ అండర్ 14 బాలుర ట్రయథాన్ గ్రూపు బి ఈవెంట్‌లో గణేష్ 1616 పాయింట్లతో రజత పతకం సొంతం చేసుకున్నాడు. ఇంతటి ప్రతిభ కనబరిచిన గణేష్‌ను, పిడి తమ్మునాయుడును అభినందించారు. ఈ కార్యక్రమంలో వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌లు రెడ్డి శ్రీనివాస్, రెడ్డి పరమేష్, వేచలం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి శరారి నాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి బలరాం, హైస్కూల్ హెచ్ఎం దేవుపల్లి నరసింహమూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రజత పతకం చూపుతున్న గణేష్, చిత్రంలో గ్రామపెద్దలు, టీచర్లు

యువత ప్రజాస్వామ్య నైతికతను బలపరచాలి

నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముత్యాలనాయుడు

మాట్లాడుతున్న మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-కశింకోట

ప్రభుత్వ ప్రజాస్వామ్య నైతికతను యువత బలపరచాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌గాంధీ ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగిన 'నైబర్ హుడ్ యూత్ పార్లమెంటు' సదస్సుకు ముత్యాలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మంచి భారతదేశం కోసం నాయకులను నిర్మించడంలో విద్యార్థులు ఉత్తేరకంగా పనిచేయాలని సూచించారు. యువతలో ఉన్న ఉత్సాహం భారత దేశాన్ని ఆర్థికంగా సాధికారత కలిగిన దేశంగా మారుస్తుందన్నారు. ప్రపంచంలోని సమకాలిన సంస్కరణలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమాచారం, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచడానికి ఎన్‌వైకె ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఆకలి నిర్మూలన, లింగ సమానత్వం, తక్కువ వ్యయంతో పరిశుభ్రమైన ఇంధనం, స్వచ్ఛమైన నీరు, పారిశుద్యం మెరుగుదల అంశాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు.

అటవీశాఖ విశాఖ రేంజ్ అధికారి బిర్లంగి రామనరేష్, వ్యక్తిత్వ వికాస శిక్షకులు ఎస్‌వీఆర్.నాయుడు మాట్లాడుతూ లక్ష్యం స్పష్టంగా లేకపోతే చేసేపని దారీ తెన్నూ లేక అగమ్యగోచరంగా తయారవుతుందని చెప్పారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు, ఎన్‌వైకె రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపల్ కెఎస్ఎవిఎన్ఎం.అప్పారావు, వైస్ ప్రిన్సిపల్ ఎస్ఎస్.గణేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఆర్.లీలాప్రసాద్, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ షఫీ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం బూడిని కలిసిన బొద్దేపు గోవింద్ తదితరులు

వైసిపి పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌ఛార్జిగా గోవింద్

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ పంచాయతీరాజ్ విభాగం విజయనగరం, విశాఖ, అనకాపల్లి జోనల్ ఇన్‌ఛార్జిగా యలమంచిలి ఎంపిపి బొద్దేపు గోవింద్ నియమితులయ్యారు. తనను నమ్మి బాధ్యతలు అప్పగించడం పట్ల గోవింద్ సంతోషం వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా గోవింద్ స్థానిక వైసిపి నేతలతో కలిసి గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బుడి ముత్యాల నాయుడును, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్య దొర, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరపు గుప్తా, గొర్లి వెంకట్, మద్రి రాజబాబు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత బంగారమ్మపాలెం

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని బంగారమ్మపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో బంగారమ్మపాలెం జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగిన ఈ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో జిల్లా నలుమూలల నుండి 36 జట్లు పాల్గొన్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన బంగారమ్మ పాలెం జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ స్థానం సాధించిన నాయుడు తోట జట్టుకు రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన గొందుపాలెం జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, ఎంపీటీసీ రాపేటి అరుణ రాము, మాజీ ఎంపీటీసీ దొడ్డి సూర్య ప్రకాష్, వైసీపీ నేత కోరిబిల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని సబ్బవరం 33/11 కెవి, సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల10న శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి. సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలో చాలా కాలంగా మరమ్మతులకు గురైన పాత బ్రేకర్స్ స్థానంలో కొత్తవి బ్రేకర్స్ అమర్చుటకు, మరింత నాణ్యతమైన విద్యుత్ పునరుద్ధరించడానికి తగు చర్యలు చేపడుతుండడంతో ఈ నెల 10న ఉదయం 8 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూకాంబిక ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని మార్టూరు నూకాంబిక ఆలయంలో గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు పూజలు చేశారు. నూకాంబిక ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఈ ఆలయానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్ బాబు, ఉప సర్పంచ్ నారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనుబాబు, కార్యదర్శి కెవి. రమణ, రామాలయం చైర్మన్ హరిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

నూకాంబిక కొత్త అమావాస్య జాతరకు

అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు

దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత

మాట్లాడుతున్న దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 20 నుంచి ఏప్రిల్ నెల 19వ తేదీ వరకు కొత్త అమావాస్య సందర్భంగా శ్రీనూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత తెలిపారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద గురువారం వైసిపి యువజన నాయకులు, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు దాడి జయ వీర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలరోజులపాటు జరిగే ఈ జాతరలో పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. జయవీర్ మాట్లాడుతూ ఆలయ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన తాగునీటిని సరఫరా చేయాలని, వీధి దీపాల మరమ్మతు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను కోరారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణ షాపులను తొలగించాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా మాక్ డ్రిల్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యశాఖ నెలరోజులపాటు ప్రత్యేక వైద్య శిబిరం ఆలయ వద్ద ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చూడాలని కోరారు. దూరదర్శన్, ఆకాశవాణి ద్వారా జాతర కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో మద్యపానం అమ్మకుండా చూడాలని, స్పెషల్ స్క్వాడ్‌తో గస్తీ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్, డిఎస్‌పి మహేశ్వరరావు, జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ బుద్ధ లక్ష్మి నగేష్, జీవీఎంసీ ఈఈ చిరంజీవి, ఏఈ సుమిత్ర, ఎన్టీఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రావణ్ కుమార్, ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగేంద్ర హత్యపై దళిత సంఘాల నిరసన

నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి -వడ్డాది

పాయకరావుపేట మండలం లక్ష్మీపురం గ్రామంలో వడ్లమూరి వీర నాగేంద్రను హత్య చేసిన వారినందరినీ అరెస్ట్ చేయాలని కోరుతూ బుచ్చయ్యపేట మండలం వడ్డాది దళిత కాలనీలో గురువారం దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాలమహానాడు యువజన అధ్యక్షులు బూసి కోటి, రాష్ట్ర రెల్లిహక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు మాట్లాడుతూ మాకవరపాలెం మండలం జి.నగరం గ్రామంలో దళితులపై అగ్రవర్ణాల దాడి చేసినవారిని, అరెస్టు చేయలేదని, ఎలమంచిలి పట్టణ నడిబొడ్డున దళిత మహిళ బంగారు లక్ష్మి అనే అమ్మాయిని మోసం చేసిన వారిని, నక్కపెల్లి మండలం ఉద్దండపురంలో దాడి చేసిన వారిని అరెస్టు చేయలేదని తెలిపారు. దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు అరికట్టడంలో ప్రభుత్వాలు, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వీటిపై జిల్లా కలెక్టర్, ఎస్పీ విన్నవించినా ఫలితం లేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులలో దోషులను తక్షణమే అరెస్టు చేయకుంటే జిల్లాలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నిమ్మకాయల ప్రసాద్, మారువాడ ఈశ్వరరావు, సియ్యాద్రి శ్రీనివాసరావు, భాగ్యవతి, భాస్కరరావు పాల్గొన్నారు.

14న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ తెలిపారు. గురువారం కలెక్టరేట్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో బాల బాలికలకు ఈ మాత్రల పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల బాలలకు అర మాత్రను నీటిలో కరిగించి తాగించాలని, రెండు నుంచి మూడు సంవత్సరాల బాలలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలని సూచించారు. మూడు నుంచి 19 సంవత్సరాల వారు పూర్తి మాత్రను మధ్యాహ్నం భోజనం చేసిన అర్ధగంట తరువాత చప్పరించాలని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఇతర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నమని పేర్కొన్నారు.

ఆరోగ్యానికి జిమ్ సెంటర్లు దోహదం

ప్రజాశక్తి-మునగపాక రూరల్

జిమ్ సెంటర్లు ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని సినీ నటుడు ప్రశాంత్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గల డాన్ జిమ్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. నిర్వాహకులు పెంటకోట విజయ్ ఆహ్వానం మేరకు విచ్చేసిన ప్రశాంత్ కుమార్ జిమ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిమ్ సెంటర్లు వ్యాపార దృక్పథంతో కాకుండా యువత ఆరోగ్యం కోసం నిర్వహించాలన్నారు. కళాకారులకు పుట్టినిల్లు అయిన మునగపాక పరిసరాలలో త్వరలోనే ఒక మంచి సినిమా విభిన్న కథాంశంతో నిర్మించబోతున్నట్లు చెప్పారు. ఈ సినిమా షూటింగ్‌కు కొంతమంది యువకుల అవసరం ఉంటుందని, దానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్‌తో పాటుగా ఏపీఎం సత్యనారాయణ, బొడ్డేడ ప్రసాద్ (జూనియర్) పాల్గొన్నారు.

రుణాలు అందజేస్తున్న రామ్మోహన్‌రావు తదితరులు

పాల ఉత్పత్తిదారులకు రుణాలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మునగపాక అమూల్ పాల సేకరణ కేంద్రం-2 పాల ఉత్పత్తి దారులైన మహిళా రైతులకు గురువారం స్థానిక ప్రాథమిక సహకార సంఘంలో రుణాలు పంపిణీ చేశారు. ఒక్కొక్క మహిళా రైతుకు రూ.30వేలు చొప్పున ఆరుగురు సభ్యులకు పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార రంగాన్ని అభివృద్ధి పరచడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. సన్న, చిన్న కారు రైతులతో పాటుగా పాడి రైతుల సంక్షేమానికి సహకార సంస్థ నుండి మరిన్ని రుణాలు అందజేసేందుకు సంస్థ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈఓ ఆడారి వేణుగోపాలకృష్ణ, అకౌంటెంట్ పివి మహేశ్వరరావు, అమూల్ సెంటర్ డిఏ బొడ్డేడ నూకరత్నం, బెక్కలి సంతోష్ లక్ష్మి పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని ఎఎస్.పేట హైస్కూల్‌లో మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు భద్రత నియమాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ఎపిఎం శ్రీనివాసరావు, పిడి నూకరాజు, సిసి శ్రీను, విఓఎ లక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

ముసిడిపల్లి హైస్కూల్‌లో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ముసిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఉదయభాస్కర్ మాట్లాడుతూ వివిధ రంగాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన కల్పనా చావ్లా, మేడం క్యూరీ, మదర్ థెరిసా కిరణ్ బేడి, సునీత విలియమ్స్, రుద్రమదేవి, సరోజినీ దేవి, ఇందిరాగాంధీ, సుధా మూర్తి వారి సేవలను కొనియాడారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు సతీసహగమనం అనే దుర్భర పరిస్థితుల నుండి చట్టసభలలో చట్టాలు చేసే స్థితికి వచ్చినా ఇంకా మహిళలకు సమానత్వం రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.సత్యారావు, కేవీ రమణ, పిడి అప్పారావు, రాంబాబు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ఎయిడ్స్ నివారణపై మండలం కోయిలపల్లి గ్రామంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఆర్‌పి గోవింద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా జీవించడానికి, అసమానతలు అంతం చేయడానికి ఏకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్సీ నాయుడు, చంద్రశేఖర్, అంగన్వాడీ కార్యకర్త జయలక్ష్మి, ఆశా వర్కర్ నాగలక్ష్మి, సచివాలయం సిబ్బంది, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ పి.ఉద్దీప, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌పి గోవింద్

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్:అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, క్విజ్ పోటీల్లో నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ముఖ్య అతిథులు పట్టణ అధ్యక్షులు ఏకాశివ, కౌన్సిలర్ జగదీశ్వరిలు విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

అందజేస్తున్న ముఖ్య అతిథులు

ఎమ్మెల్సీ ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-కోటవురట్ల: ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ జయరాం సూచించారు. గురువారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకోవాలన్నారు.డివిజన్ పరిధిలో 18 వేల ఓటర్లకు గాను 21 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 1092 మంది ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉందన్నారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో చేపడుతున్న భూముల రీ సర్వే సుమారు 50 గ్రామాల్లో చేపడుతున్నామన్నారు. కోటవురట్ల మండలానికి సంబంధించి ఆరు గ్రామాలు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. ఎటువంటి వివాదాలు తలెత్తకుండా సర్వే చేసే గ్రామాల్లో రైతులకు ముందస్తు సమాచారం అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దారు జానకమ్మ, ఆర్ఐ ఉర్ధవరావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ జయరాం

క్రీడా సామగ్రిని ఇస్తున్న మూర్తి

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానికులు, అమెరికాలో స్థిరపడ్డ పిట్టా మూర్తి గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పిట్టా మూర్తి మాట్లా డుతూ, నర్సీపట్నంలో క్రీడాకారులు మంచి నైపుణ్యంతో జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకు వస్తున్నారని కొనియాడారు. క్రీడాకారులను తీర్చిదిద్దడంలో నింజాస్ స్పోర్ట్స్ అకాడమీ కృషి చేస్తుందన్నారు.క్రీడ సామాగ్రి సమకూర్చుకోలేకపోవడంతో పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని తన వంతుగా సహకారం అందించాలని నిర్ణయించానన్నారు. మూర్తి కుమార్తె పర్నిక, అకాడమీ ఛైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్ సుతాపల్లి శ్రీకాంత్‌ల చేతుల మీదుగా క్రీడా సామాగ్రిని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ ఎర్రా శేఖర్, పంచాడ హరినాథ్, ఎం విజయ్, సీనియర్ బాక్సర్లు మౌనిక, ప్రియాంక, తేజస్విని, లాస్య, జ్యోతి, శశి పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపమాక వెంకన్న కళ్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారి పుష్పయాగోత్సవంను బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అద్దాల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవమూర్తులను ఉయ్యాల్లో పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అద్దాల మండపాన్ని పూల అలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు శాస్త్రోక్తంగా పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉయ్యాలలో ఉత్సవ మూర్తులు

ముగిసిన వాలీబాల్ పోటీలు

విజేత పాములవాక జట్టు

ప్రజాశక్తి-కోటవురట్ల:కైలాసపట్నం గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలలో పాములవాక గ్రామానికి చెందిన జట్టు విన్నెర్స్ గా నిలిచింది. రన్నర్స్‌గా కైలాసపట్నం నిలిచింది. ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.5000లను మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు చేతుల మీదుగా అందజేశారు. డివి యువసేన అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కిల్లాడ సాయి, సిద్ధ బత్తుల నాగేశ్వరరావు, మండల వైసిపి అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, కోటవురట్ల సర్పంచ్ అనిల్ కుమార్, తంగేడు సర్పంచ్ శివ ప్రసాద్, బోడపాలెం సర్పంచ్ ఎరుకునాయుడు, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు వెంకటలక్ష్మి, కైలాసపట్నం సర్పంచ్ నూకరత్నం, కైలాసపట్నం ఎంపిటిసి వెంకటరమణ పాల్గొన్నారు.

బహుమతిని ఇస్తున్న మాజీ ఎమ్మెల్సీ

సుజాతను సన్మానిస్తున్న అనురాధ

సుజాతకు ఘన సన్మానం

ప్రజాశక్తి-గొలుగొండ:అనకాపల్లి జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలుగా నియమితులైన గొలుగొండ మండలం ఏఎల్‌పురం మేజర్ పంచాయతీ సర్పంచ్ లోచల సుజాతను మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైసిపి కార్యాలయంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ, తాను ఈ స్థానంలో ఉండటానికి కారకులైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియపరుస్తూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను శక్తి సామర్థ్యాలతో పని చేసి పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా పండగలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలోని శెట్టిపాలెం, బయ్యవరం గ్రామాల్లో అమ్మవారి పండగలను ఘనంగా నిర్వహించారు. శెట్టిపాలెంలో బోడకొండమ్మ తల్లి పండగను నిర్వహించారు. సర్పంచ్ అల్లు రామునాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. బయ్యవరం గ్రామంలో మూవ్వలమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. బయ్యవరం గ్రామానికి చెందిన లాలం సూర్యనారాయణ మూర్తి , కోటేశ్వరి దంపతులు అమ్మ వారికి లక్ష ఆరవైవేల విలువైన రెండున్నర తులాల బంగారం ఆభరణంను కానుక గా అందజేశారు. ఆయా గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గ్రామంలో రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నర్సీపట్నం రూరల్:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 2023-2024 కేంద్ర బడ్జెట్ పై గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ, కామర్స్ విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వార్షిక బడ్జెట్‌పై పూర్తి అవగాహన చేసుకొని విశ్లేషణాత్మకమైన అధ్యయనాన్ని చేయాలని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్.ఎస్. కృష్ణ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌పై పోటీ పరీక్షల్లో అత్యంత ప్రాధాన్యత అంశాలను ఉంటాయని, విద్యార్థులు డిగ్రీ స్థాయి నుంచే అభ్యసించడంతో భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సులభతరం అవుతుందని తెలిపారు. కామర్స్ అధ్యాపకులు టి.నానాజీ మాట్లాడుతూ, 2023-2024 కేంద్ర బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయించిన నిధుల వివరాలను విద్యార్థులకు విషదీకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజు


విరాళం అందిస్తున్న పైలా, ముత్యాలనాయుడు

నూకాంబిక ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని కైలాసపట్నంలో నూకంబిక అమ్మవారు ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన దేవాలయం ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు ఆలయంలో అన్న సమారాధన నిర్వహించారు.

ఆలయం వద్ద భక్తులు

ప్రయివేటీకరణపై ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.శాంత కుమారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డెలిగేట్ సభ్యుడు పి.చిన్న స్వామి మాట్లాడుతూ. గత ప్రధానమంత్రులు ప్రభుత్వ సంస్థలను అభివృద్ధి చేస్తే బిజెపి కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. వీటిని అదాని, అంబానీ వంటి కార్పొరేట్ బడా బాబులకు కట్టబెడుతుందని విమర్శించారు.

కనకదుర్గ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని తంగుడుపల్లి గ్రామంలో కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. మాజీ వైస్ ఛాన్సలర్ ముత్యాల నాయుడు, మాడుగుల తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు, పాత్రుని సురేష్, రెడ్డి సన్యాసినాయుడులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి పైలా ప్రసాదరావు రూ.10 వేలు, పాత్రుని సురేష్ రూ.15 వేలను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు.


తనిఖీ చేస్తున్న ఉప విద్యాశాఖాధికారి

పాఠశాలను ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ ఆవరణ, తరగతి గదులను పరిశీలించిన ఆయన పలువురు విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబు వినియోగంపై అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం వినియోగం పై పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి మూర్తి ఉన్నారు.

మల్లేష్‌కు కుంభా రవిబాబు ఘన సత్కారం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : అల్లూరి యువ గిరిజన సేవా సంఘం, హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో చేస్తున్న అనేక సేవలను గుర్తించి సేవా సంఘం అధ్యక్షులు టి. మల్లేష్‌ను నర్సీపట్నం వేదిక ఫంక్షన్ హాల్లో జరిగిన ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభ రవిబాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ, అల్లూరి యువజన సేవా సంఘం, హెల్పింగ్ హాండ్స్ గ్రూపు సభ్యుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్లు జర్ర అప్పారావు, అరుణ్ కుమార్, నర్సీపట్నం ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.ధనార్జన్ ప్రధాన కార్యదర్శి ఎస్.సుదర్శనరావు, కొర్రారి సోమయ్య, ఎం.సాయిశంకర్, కొంటా బాలకృష్ణ, రామారావు, ధర్మరాజు, సురేష్ కుమార్, గోపాల్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

462వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి :హెటిరో కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 462వ రోజుకు చేరింది. గురువారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్ లైన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కంపెనీ కాలుష్య వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి పోవడంతో తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. 462 రోజుల నుండి తామంతా పైప్ లైన్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తుంటే, అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసిపిల్లి నూకరాజు, గోసల స్వామి, పీక్కి రమణ, కోడ కాశీ, మైలపల్లి ధార్రాజు, కారే కోదండరావు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న బాలికలు

ఇంటర్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్ ద్వితీయ ఏడాది విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు చెప్పేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, మేడివాడ, రావికమతం తదితర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకర్షించాయి. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులకు కళాశాల ప్రిన్సిపాల్ సాయికుమార్, అధ్యాపక బృందం మెమొంటోలను అందజేశారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటి చైర్మన్ మంజీటి రాము, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రవిబాబుకు వినతిపత్రం ఇస్తున్న వర్కర్లు

పోస్టుమెట్రిక్ వసతి గృహ వర్కర్ల వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :చాలీచాలని జీతాలతో కుటుంబాలతో నానా అవస్థలు పడుతున్నామని ఉమ్మడి విశాఖ జిల్లా పోస్టుమెట్రిక్ వసతి గృహాల వర్కర్లు నర్సీపట్నంలో పర్యటించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాము ఉమ్మడి విశాఖజిల్లా పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో గత 20 సంవత్సరాల నుండి పని చేస్తున్నామని, తమను ఇంత వరకు ఔట్సోర్సింగ్ వర్కర్లుగా పరిగణించలేదన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ వృత్తినే నమ్ముకొని వసతి గృహాల్లో పని చేస్తున్నామని, వేసవి కాలం సెలవుల్లో తాము కుటుంబాలతో బతకడానికి అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమను ఔట్సోర్సింగ్ వర్కర్స్ గా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు ఆర్.అప్పారావు, ఎం.రాజేశ్వరి, కె.భవానీ, జె.శాంతమ్మ, దేవుడమ్మ, జ్యోతి పాల్గొన్నారు..

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

రమాప్రభకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న ఉక్కు కార్మిక నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని విశాఖ ఉక్కు పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలో పలు సంఘాల నేతలు ముమ్మరంగా ప్రచారం చేపట్టారు.

ఉక్కునగరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని విశాఖ ఉక్కు పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన విభాగం వద్ద గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజాతంత్రవాదులను మండలికి పంపిస్తే పేద, మధ్యతరగతి గొంతును, కార్మిక వాణిని వినిపిస్తారని చెప్పారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగస్వామ్యమైన రమాప్రభ గెలుపు ఉద్యమం బలోపేతానికి దోహదపడుతుందన్నారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, నిరంతరమూ ప్రజా సేవ చేస్తున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉక్కు కార్మికులను అభ్యర్థించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, రమాప్రభ గెలుపంటే విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి మద్దతు ఇవ్వడమేనని పేర్కొన్నారు. ఎఐసిటియు ప్రధాన కార్యదర్శి చిత్రాల సన్యాసిరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కులో ఉన్న పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఉద్యమాలకు మద్దతు పలుకుతున్న రమాప్రభను గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. డివిఆర్ఎస్ఇయు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, డిఐటియు నాయకులు సురేష్ కుమార్, సిపిఐ నాయకులు టి.కనకరాజు, ఎఐటియుసి నాయకులు రామకృష్ణ, రాజబాబు, సిఐటియు నాయకులు వైటి.దాస్, ఎం.రామారావు, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, బి.అప్పారావు, నీలకంఠరావు, కెఎం శ్రీనివాసరావు, యూజ్ నాయకులు కామేశ్వరరావు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో లాయర్లను, ఉద్యోగులను, సిబ్బందిని కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. 72వ వార్డు కార్పొరేటర్ స్టాలిన్ మాట్లాడుతూ, సమస్యలపై పోరాటానికి రమాప్రభను ఎన్నుకోవాలని లాయర్లకు విజ్ఞప్తి చేశారు. లాయర్లు ఎ.సీతామహాలక్ష్మి, బి.రామారావు, వెన్నెల ఈశ్వరరావు, శ్రీనివాసరావు, నిరంజన్, బి.సంతోష్‌కుమారి, సిపిఎం కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు నగిరెడ్డి రామారావు, ఎన్.రాజేంద్రప్రసాద్, జి.స్టాలిన్, సిపిఐ జోన్ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ జివిఎంసి 67వ వార్డు పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.సంతోషం, వార్వా, నివాస్ నాయకులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, కిరీటం పాల్గొన్నారు.

కరాస: డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని 90వ వార్డు పరిధి కాకానినగర్‌లో ఐద్వా నాయకులు ప్రభావతి ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, వై.సత్యనారాయణ, నీలిమ, ఎంవి.నారాయణ పాల్గొన్నారు.

పెందుర్తి : 97వ వార్డు పరిధి కార్మికనగర్‌లో రమాప్రభకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు రమణి మాట్లాడుతూ, శాసనమండలిలో ప్రజలు తరపున పోరాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని చెప్పారు. సిఐటియు నాయకులు జగన్, ఐద్వా నాయకులు రమణి, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

లీగల్ విలేకరి : కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ యూనియన్ ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ హాజరై మాట్లాడారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి.రామాజనేయరావు, ఐఎయల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ఎస్.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

గోపాలపట్నం : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని

న్యాయవాదులతో మాట్లాడుతున్న రమాప్రభ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోర్టు నాయకులు

తూర్పుగోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎం.వెంకటేశ్వరరావు పట్టభద్రులను కోరారు. గోపాలపట్నం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. సిఐటియు జోన్ అధ్యక్షులు గుడివాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పోర్టు అఖిలపక్ష కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక మద్దతు తెలిపింది. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక నాయకులు విఎస్.పద్మనాభరాజు (గౌరవ అధ్యక్షులు, యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ - సిఐటియు), బిసిహెచ్.మసేన్ (విశాఖ హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ - ఎఐటియుసి), ఎన్.కనకారావు (జాతీయ అధ్యక్షులు, జనతా పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ - సిఎఫ్‌టియుఐ), జి.చందు (అధ్యక్షులు, నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ - ఐఎన్‌టియుసి), బి.రామారావు (ప్రధాన కార్యదర్శి, విడిబిఎల్ అండ్ సిహెచ్‌డి పెన్షనర్స్ సంక్షేమ సంఘం), బి.లక్ష్మణరావు (ప్రధాన కార్యదర్శి, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ - సిఐటియు) మాట్లాడారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు బి.జగన్, సత్యన్నా రాయణ, రామలింగేశ్వరావు, ఎల్లారావు, నర్సింగరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ:కోరెడ్ల రమాప్రభను గెలిపించాలంటూ 18వ వార్డు అంజయ్య నగర్ కాలనీలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిడిఎఫ్ బృందం సభ్యులు జె.కోదండ, ఎం.చంటి, జి.సంతోష్, ఎన్‌వి.రమణ, జె.లక్ష్మి, జి.గీతాంజలి, కనక మహాలక్ష్మి, చందు, ప్రణయ్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము ఆధ్వర్యాన గురువారం ప్రచారం చేశారు. అచ్చుతాపురం మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో ఉదయం వాకర్స్‌ను కలిశారు.

రోలుగుంట: మండలంలోని కొండపాలెం, కొమరవోలు, అడ్డసరం గ్రామాల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, శ్రీరామ్మూర్తిలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

సిఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యూయలరీ మాల్ ప్రారంభం

ప్రారంభిస్తున్న టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరు ప్రఖ్యాతలుగాంచిన వస్త్రాభరణాల సంస్థ సిఎంఆర్ గురువారం విశాఖపట్నంలో ప్రత్యేక బంగారు ఆభరణాల షోరూంను ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, వీర సింహారెడ్డి ఫేమ్ కథానాయికి హనీ రోజ్ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ సిఎంఆర్ లాంటి వాణిజ్య సంస్థల ద్వారా నిరుద్యోగులకు ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఇటువంటివి మరిన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు రాష్ట్రంలో ప్రజల మన్ననలు పొందుతూ నమ్మకానికి పెట్టింది పేరుగా సిఎంఆర్ నిలిచిందన్నారు. గ్లోబల్ సమ్మిట్లు, జి-20 సదస్సులతో నగరానికి ప్రపంచ నలుమూలల నుంచీ అతిథులు వస్తున్నారని, అటువంటి వారిని ఇటువంటి మాల్స్ ఆకర్షిస్తాయని తెలిపారు. సిఎంఆర్ గ్రూప్ ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తొలిసారిగా బంగారు ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ షోరూంను ఏర్పాటు చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ డబుల్ ధమాకా ఆఫరుగా గ్రాము బంగారంపై రూ.200 క్యాష్ బ్యాక్ ఉందన్నారు. ఎంత బంగారం కొంటే అంత వెండి ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. వినియోగదారుల అభిరుచికి, శైలికి తగ్గట్లుగా ప్రాచీనత నుంచి ఆధునికత వరకు అన్ని రకాల ఆభరణాలూ ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, పైడా విద్యాసంస్థల చైర్మన్ పైడా కృష్ణ ప్రసాద్, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, ఎమ్మెల్యే చిర్ల జగ్గారెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు, లక్కీ షాపింగ్ మాల్ అధినేత స్వామి, హోటల్ మేఘాలయ ఎమ్‌డి సురేష్ విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీరసింహారెడ్డి హీరోయిన్ హనీ రోజ్ షాపింగ్ మాల్‌లో సందడి చేశారు. కార్యక్రమంలో చందన బ్రదర్స్ వ్యవస్థాపకులు చందన మోహన్‌రావు, సిఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ, సిఎంఆర్ జనరల్ మేనేజర్ లింగమూర్తి పాల్గొన్నారు.



సందడి చేస్తున్న హనీ రోజ్